పన్నెండేళ్ళ కుర్రవాడు, పదహారునుంచి ఇరవైయేళ్ళ కుర్రవాళ్ళతో కలిసి తిరగడానికి ఉత్సాహపడతారు. అతడు తనకన్నా చిన్నవాళ్ళయిన ఎనిమిది, పది సంవత్సరాల పిల్లలతో ఆడుకోవడానికిగాని, తిరగడానికిగాని ఇష్టపడడు. ఇలాంటప్పుడే తనకన్నా పెద్దవాళ్ళయిన స్నేహితులను గాని, మామయ్యలను లేదా బాబాయ్‌లనుగాని ఆశ్రయిస్తాడు. అదే మనస్తత్వం ముసలివాళ్ళలో కూడా కనిపిస్తుంది.

ఉదాహరణకి నలభై యేళ్ళు దాటిన వ్యక్తి పాతికేళ్ళ యువకుడితో కలిసి కాలం గడపడానికి ఉత్సాహం చూపిస్తాడు. అరవైయేళ్ళ ముసలివాడు పదిలోపు బాలబాలికలతో ఆడుకోవడానికు ఉత్సాహం చూపిస్తాడు. ఇలాగ వయసులో వచ్చే మార్పులు తమ సహచరుల వయస్సు మీద చాలా ఆధారపడి వుంటాయి.

తల్లిదండ్రులు పిల్లలలోవచ్చే ఈ మార్పుని గుర్తించవలసివుంటుంది. ఇటువంటి పరిస్థితుల్లోనే పిల్లల స్నేహితులు ఎవరు అనే విషయాన్ని కూడా తల్లిదండ్రులు పరిగణలోకి తీసుకోవలసి వుంటుంది.

చెడ్డ కంపెనీలో తిరుగుతున్న కొడుకుని వెంటనే సరిదిద్దుకోవలసి వుంటుంది. ఎందుకంటే ఈ వయస్సు ఒక వ్యసనాన్ని 'థ్రిల్'గా భావిస్తారే తప్ప, అది భవిష్యత్తులో తమని పాడు చేస్తుందని ఊహించలేరు.

ఉదాహరణకి నలుగురు స్నేహితులలో ఒక కుర్రవాడు సిగరెట్ తాగకుండా మిగతా ముగ్గురూ సిగరెట్లు, మత్తుపదార్థాలు తీసుకొనే వ్యక్తులైతే ఆ కుర్రవాణ్ని వాళ్ళు చాలా తేలికగా చులకనగా చూస్తారు.

'సిగరెట్ కూడా తాగలేవు ఇంకెందుకు పనికొస్తావురా' అంటూ తరచూ దెప్పి పొడుస్తూ వుంటారు. అప్పుడు తల్లిదండ్రులే ఆ కుర్రవాడితో మంచి కమ్యూనికేషన్ ఏర్పరచుకొని 'సిగరెట్ తాగేవాడికన్నా, తాగనివాడే గొప్పవాడు. నీకు క్లాసులో ఫస్టు వస్తున్నది కాబట్టి నిన్ను చెడగొట్టడానికి, వాళ్ళలోకి నిన్ను లాక్కోవడానికి ప్రయత్నం చేస్తున్నారు' అని చెప్పగలిగితే ఆ కుర్రవాడు తప్పకుండా అర్థం చేసుకుంటాడు. పదహారేళ్ళ కుర్రవాడి మనసు అద్దంలాంటిది. ఎదురుగా ఏ వస్తువు పెడితే అదే ప్రతిబింబిస్తుంది.

అలాగే అమ్మాయిల్లో కూడా, ఆ అమ్మాయి చుట్టూ వున్న అమ్మాయిలందరికీ బోయ్‌ఫ్రెండ్స్ వుంటే, తనకీ ఒక బోయ్‌ఫ్రెండ్ లేకపోవటమే తన అవలక్షణంగా భ్రమించే అవకాశం వుంది. అదే విధంగా స్నేహితుల్లో బాగా డబ్బున్నవాడు, ఒక కారుని కాని, స్కూటర్ గాని మెయింటైన్ చేస్తే, మీ కుర్రవాడు తనకవి లేకపోవడాన్ని తన తండ్రి చేతకానితనంగా భావించే ప్రమాదముంది. అందువల్ల నిరంతరం మీ పిల్లల యొక్క స్నేహబృందాన్ని మీరు గమనించవలసి వుంటుంది.

చదువు :

చదువు అంటే స్కూల్‌కెళ్ళడం, పాఠాలు చదవడం కాదని ముందే చెప్పడం జరిగింది. చిన్న పిల్లల్లో ఐ.క్యూ. పెంచడానికి చదరంగం ఒక మంచి ఆట. అదే విధంగా వర్డ్స్ బిల్డింగ్, డిక్షనరీ చదవడం - ఇలాంటివి కూడా చిన్నపిల్లల తెలివితేటలని పెంచడానికి సహాయపడతాయి. పొద్దున్నే లేచిన తర్వాత తమ పక్కబట్టలు నీటుగా సర్దిపెట్టుకోవడం, గదిని శుభ్రంగా వుంచుకోవడం, తన నీళ్ళు తనే బాత్రూమ్‌లో పెట్టుకోవడం, పుస్తకాలు సర్ధుకోవడం - ఇవన్నీ కూడా చదువులోకే వస్తాయి.

చదువు జీవితానికి ఆధారమైతే, ఇలాంటి చదువు చదువుకే ఆభరణమౌతుంది. ఒక రకంగా చూస్తే ఆటలుకుడా చదువులో భాగమే. క్రీడలు, సంగీతం, డాన్స్, డ్రామా ఇవన్నీ పిల్లలు రిలాక్సవడానికి సహాయపడతాయి.

మీరు గమనించి చూడండి. ఏదేనా ఒక కళపట్ల ఉత్సాహం వున్న పిల్లవాడు మిగతా పిల్లవాళ్ళలాగా, రోడ్ల కూడలిలో నిలబడి మాట్లాడడం, గేట్లు పట్టుకొని స్నేహితులతో మాట్లాడటం చేయడు. చదువైన తర్వాత తన కళలో నిమగ్నమౌతాడు.

అంతేగాక, ఏదైనా ఒక కళలో ప్రావీణ్యం వున్న ఒక కుర్రవాడు, ఏ కళలోనూ ప్రవేశం లేని వాళ్ళకంటే స్కూల్లో ఎక్కువ మార్కులు సంపాదిస్తాడు. కాబట్టి ఏదైన ఒక ఆర్టులో మీ పిల్లవాడిని ప్రవేశపెడితే వాడు చదవడానికి టైముండదేమో, అందువల్ల మార్కులు సరిగా రావేమోనన్న భయం అనవసరం.

ఏ పిల్లలయినా చదివేది, మనసుకి ఎక్కించుకునేది కేవలం రెండు మూడు గంటలు మాత్రమే. మిగతా టైమంతా ఖాళీగా వుండేకన్నా ఒక ఆర్ట్‌లో ప్రవేశపెడితే ఎక్కువ ప్రయోజనం వుంటుంది.

చదువుకు సంబంధించిన విషయాలే కాకుండా పిలలకి చాలా ప్రాపంచిక విషయాలో అనుమానాలొస్తుంటాయి. వాటికి ఓర్పుగా సమాధానం యివ్వవలసిన బాధ్యత తల్లిదండ్రులదే. ఇక్కడొక గమ్మత్తయిన విషయం ఏంటంటే, పిల్లలేదైనా ప్రశ్నిస్తే, దానికి సమాధానం తల్లిదండ్రులకు తెలియకపోతే, వెంటనే వాళ్ళు అది తెలుసుకోవలసినంత ప్రాముఖ్యం లేనిదన్నట్లుగా 'నీ కెందుకురా పోయి చదువుకో' అనో లేదా 'ఇలాంటి అనవసర విషయాలెందుకురా' అనిగానీ తోసిపుచ్చడానికి ప్రయత్నిస్తూ వుంటారు.

ఇది చాలా దారుణమైన విషయం. తమకి తెలియకపోతే పిల్లలతో కలిసి ఏ పుస్తకాలో వెతికి చూసి తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. అంతేకాని, కేవలం తమకు తెలియకపోవడం వల్ల ఆ విషయాన్ని ప్రాముఖ్యత లేనిదిగా తోసిపడేయకూడదు.

చాలామంది పిల్లలు కొన్ని కేటగిరీస్‌లోకి వెళ్ళరు. గర్వం గల వాళ్ళు, సున్నిత హృదయులూ, తమమీద తమకి ఎక్కువ నమ్మకం వున్నవాళ్ళు, తమ్మీద తమకి సలు నమ్మకం లేనివాళ్ళు, ప్రతి చిన్న విషయాన్ని పెద్దదిగా చూసేవాళ్ళు, పెద్ద విషయాన్ని కూడా చాలా తేలికగా చూసేవాళ్ళు - ఇలా పిల్లలు రకరకాలుగా వుంటారు.

దురదృష్టకరమైన విషయం ఏంటంటే చాలామంది తల్లిదండ్రులకి తమ పిల్లలు ఏ కేటగిరిలోకి వెళ్తారో తెలీదు. తెలుసుకోవడానికి ప్రయత్నించరు కూడా. అలా కాకుండా తమ పిల్లలపట్ల తమ రియాక్షన్ ఏ విధంగా వుండాలి అనేది ప్రతీ తండ్రీ ఆలోచించుకోవలసి వుంది. ఒక పిల్లవాడు తానెలాంటివాడో తెలుసుకొనే అవకాశం ఏమాత్రం లేదుకానీ, ఎంతో వయస్సుండి, ఎంతో అనుభవమున్న తల్లిదండ్రులు కూడా తమ పిల్లలెలాంటివాళ్ళు, వాళ్ళపట్ల తామెలా ప్రవర్తించాలి అన్నది తెలుసుకోకపోవడం చాలా దారుణమైన పరిస్థితి.

చాలా సున్నితమయిన కుర్రవాడుంటే, వాడు స్కూల్‌నుంచి అరగంట ఆలస్యంగా వస్తే కారణం కూడా తెలుసుకోకుండా ఆ పిల్లవాడిని తంతే వాడు ఆత్మహత్య చేసుకొనే ప్రమాదం కూడా వుంది. ఆ పిల్లవాడు యెలాంటివాడో తెలుసుకోవాలనే బాధ్యత మీదే తప్ప, తెలియచెప్పాల్సిన బాధ్యత మీ పిల్లవాడిది కాదు.

ఒక లాలిత్యమైన పిల్లవాడిని యివ్వడం ద్వారా మీకు దేవుడెంతో సహాయం చేశాడు. అతని హృదయాన్ని బండబారినట్లు చేస్తే మీరతనికి ద్రోహం చేస్తారు. ఈ విషయం మీరు సదా గుర్తుంచుకోవాలి.

ఇంకొందరు పిల్లలకి, తమకు తామే బోధించుకుని చదువుకొనే గుణం వుంటుంది. ఇది చాలా గొప్ప లక్షణం. దాన్ని చంపేయడానికి మీరు కూడా ప్రయత్నించకూడదు. ఉదాహరణకి, ఒక సైన్స్‌పాఠాన్ని కుర్రవాడు చదివి, అర్థం చేసుకొని, దానిని తిరిగి తనదైన రీతిలో రాస్తే - పుస్తకంలో ఉన్నదున్నట్లుగా యెందుకు రాయలేదని దండించకూడదు.

ఈ దుర్గుణం తల్లిదండ్రులలోనే కాకుండా టీచర్లలో కూడా కనబడుతుంది. ఎప్పుడైనా సరే ఒక కుర్రవాడు, ఒక విషయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే అది "కంఠతా పెట్టి గుర్తుంచుకునే దానికన్నా" యెక్కువ కాలం గుర్తుంటుంది.

మీ పిల్లలని మీరు అప్పుడప్పుడు లైబ్రరీకి తీసుకువెళుతుండాలి. పుస్తక ప్రపంచం సముద్రమంత గొప్పది అన్న విషయం చిన్నపిల్లల మనస్సులో నాటితే, అది పెద్దయ్యాక వాళ్ళకి చాలా సహాయం చేస్తుంది.

మీకున్న అభిరుచుల్లోకి మీ పిల్లవాళ్ళను తీసుకెళ్ళగలిగితే, అంటే మీతోపాటు లైబ్రరీకి, గుడికి, పార్కుకీ, సినిమాకి తీసుకువెళ్తూ మీ కార్యక్రమాల్లో మీ పిల్లవాణ్ని కుడా భాగస్వామిని చేస్తే, మీ పట్ల మీ పిల్లవాడు ఆప్యాయతని పెంచుకుంటాడు.

చాలామంది తల్లిదండ్రులు సినిమాలకి వెళ్తున్నప్పుడు గాని, లేదా ఫ్రెండ్స్ ఇంటికి డిన్నర్‌కి వెళ్తున్నప్పుడు గాని పిల్లలని తమ అత్తమామల దగ్గరో, తల్లిదండ్రుల దగ్గరో వదిలేస్తూ వుంటారు. ఇలా చెయ్యడంవలన పిల్లలకి 'మేనర్స్' నేర్పడం అనేది జరగకపోగా, మీ నుంచి వాళ్ళు వేరనే భావాన్ని వాళ్ళలో కలుగజేస్తున్నారన్నమాట. మీరు యవ్వనంలో వుండి, మీ పిల్లలు చిన్నవాళ్ళుగా వున్నప్పుడు, మీ నుంచి వేరు అనే భావం మీరీ విధంగా క్రియేట్‌చేస్తే, మీ పిల్లవాళ్ళు యువకులై మీరు ముసలివాళ్ళయ్యాక, వాళ్ళు ప్రపంచంలోకి

అప్పుడు కేవలం మీ అనా రోగ్యానికి మీ పిల్లలిచ్చే డబ్బులతో సంతృప్తిపడి మీరు గడపవలది వుంటుంది.

ఇప్పుడు మీ పిల్లల కోసం తవ్వే పునాది 'ప్రేమ' అయితే. మీ తర్వాత మీ పిల్లలు మీకిచ్చేభవంతి 'ఆప్యాయత'.

పిల్లల్లో వున్న ఉత్సాహాన్ని పనిగట్టుకొని చంపెయ్యడం బాధ్యతగా కొంతమంది భావిస్తూ వుంటారు. పాఠ్య పుస్తకాలు కాకుండా మిగతా పుస్తకాలు చదివే అలవాటున్న పిల్లల్ని 'ఎందుకురా ఆ పాడు పుస్తకాలు చదవడం' అని అనడం ద్వారా వాళ్ళలో ఉత్సాహాన్ని చంపేస్తూ వుంటారు.

మా ఫ్రెండ్ కూతురికి ఐదేళ్ళుంటాయి. నేను వారానికోసారి వాళ్ళింటికి వెళ్తుంటాను. ఆ పాప 'అంకుల్' 'అంకుల్' అంటూ నా దగ్గరకొస్తుంది. ఆ మధ్య తరచుగా ఆ పాప చేతిలో ఏదో ఒక పుస్తకం వుండేది. చదవడానికి నన్ను హెల్ప్ చెయ్యమని అడిగేది. ఇద్దరం సోఫాలో కూర్చుని చదివేవాళ్ళం. అందులో బొమ్మలతో సహా పేర్లుండేవి.

చదువుతూ మాట్లాడటం నేర్చుకోడానికి ఆ పుస్తకం బాగా ఉపయోగపడేది. అది ఇంగ్లీషు చందమామ. మొదట్లో ఆ పాపకి దాన్ని ఎలా చదవాలో, ఎలా అర్థం చేసుకోవాలో తెలిసేది కాదు. నేను కొద్దికొద్దిగా హింట్స్ ఇచ్చేవాడిని.

ఆ పాప నెమ్మదిగా అర్థం చేసుకొని, చాలా ఆశ్చర్యకరంగా ఒక సంవత్సరం తిరిగే సరికల్లా ఆ అమ్మాయి స్వంతంగా ఆ ఇంగ్లీషు చందమామని చదవడం నేర్చుకుంది.

ఇతరులకి ఏదైనా నేర్పించేటప్పుడు వాళ్ళ స్థాయిని మనం గుర్తుపెట్టుకోవాలి. ముఖ్యంగా పిల్లల విషయంలో వాళ్ళు ఏ దృష్టితో ఆ పుస్తకాన్ని చదువుతున్నారో గ్రహించి, ఆ దృష్టితో ఆ పుస్తకాన్ని చదువుతున్నారో గ్రహించి, ఆ దృష్టిని మరింత విస్తృతపరిచేలా చెయ్యాలి.

పిల్లలకి పాఠాలు చెప్పేటప్పుడు కూడా మన లెవెల్‌లో ఆలోచించి చెప్పకూడదు. ఉదాహరణకి; ఒక ఎల్కేజి చదువుతున్న పిల్లవాడు '2x2=4'అన్న విషయాన్ని కూడా చాలా పెద్ద విషయంగానే భావిస్తాడు. వాళ్ళు చదువుతున్న పుస్తకంలోని విషయాలు, పదాలు మనకు బాగా తెలిసి వుండడం వల్ల, అవి చాలా సులభంగానే వున్నట్టు మనకి కనిపిస్తుంది. కానీ, పిల్లల దృష్టిలో మాత్రం అది చాలా కష్టమైనది.

పిల్లలు పుస్తకాలు చదువుతున్నప్పుడు కొంతమంది పైపైన తిరగేస్తూ వుంటారు. లోతుగా చదవరు. దీనిని గుర్తించవలసిన బాధ్యత కూడా తల్లిదండ్రులదే.

పిల్లలు సామాన్యంగా ఆరో పేజీ చదువుతున్నప్పుడు ఐదో పేజీ వరకూ చదివినది

మర్చిపోతుంటారు. దీనిని మనం పెద్ద విషయంగా తీసుకొని, వాళ్ళకి జ్ఞాపకశక్తి లేదని అనుకోకూడదు. ఇది చాలా సర్వసాధారణమైన విషయం.

పిల్లలు తమ గదిలో కూర్చుని తాము చదువుకొంటూ వుంటే, పెద్దవాళ్ళు పక్కగదిలో కూర్చుని టీ.వీ చూసుకుంటున్నా, టేప్‌రికార్డర్ పెట్టుకొని కబుర్లు చెప్పుకుంటున్నా అప్పటివరకు చదివినది పిల్లలు మరిచిపోయి ఆ పక్కగదిమీదే వాళ్ళ ధ్యాస పెట్టుకోవడం సాధారణమైన విషయం.

ఇలాంటి చిన్న చిన్న పొరపాట్లు చెయ్యకూడదు. అలాగే వాళ్ళు ఓ గదిలో చదువుకుంటున్నప్పుడు మిగిలిన పెద్దవాళ్ళందరూ పేకాడుకుంటూనో, కబుర్లు చెప్పుకుంటూనో వుంటే 'మిగతా ప్రపంచం అంతా ఆనందంగా వుంది. తాము మాత్రం ఈ చదువు అనే నరకంలో వున్నాం' అన్న భావం పిల్లలకి కలుగుతుంది. ఇలాంటి భావాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ పిల్లలకి కలుగచెయ్యకూడదు.

ప్రతి మనిషిలోనూ కొన్ని అభినందింపదగ్గ విషయాలు, కొన్ని లోపాలు వుంటాయి. మీ పిల్లలలో అభినందింపదగ్గ విషయాలుంటే వాటిని ఎక్కువగా గుర్తించండి. లోపాలని ఎత్తి చూపకుండా వీలైనంతవరకూ సరిదిద్దడానికి ప్రయత్నించండి. మాటిమాటికి 'నువ్వు ఎందుకూ పనికిరావురా వెధవా, నీలాంటి వాణ్ణెందుకు కన్నానో' - ఇలాంటి మాటలతో వాళ్ళని బాధపెడితే దానివల్ల నష్టపోయేది వాళ్లతో పాటు మీరు కూడా.

హిప్నటిస్టులూ - చదువు :

చాలా మంది ఇంటర్మీడియెట్ చదివే కుర్రవాళ్ళు డిగ్రీ చదువుతున్న అమ్మాయిలు, కొంతమంది తల్లిదండ్రులూ, చదువుమీద ఏకాగ్రత పెరగడానికి చదివిన విషయం జ్ఞాపకం వుంచుకోవడానికి హిప్నటిజం బాగా ఉపయోగపడుతుందని భావిస్తూ వుంటారు.

ఒక విషయం బాగా గుర్తుండాలంటే దాన్ని బాగా చదవాలి. దాన్ని బాగా గుర్తుపెట్టుకొనేలా శాయశక్తులా ప్రయత్నించాలి. అంతేగాని మూడువందల రూపాయలు ఫీజివ్వడం ద్వారా ఓ వారం రోజులు 'రిలాక్స్' 'రిలాక్స్' అంటే నిద్రపోవడం ద్వారా చదువొస్తుందని, విషయాలు గుర్తుపెట్టుకుంటామని అనుకుంటే అది కేవలం భ్రమ మాత్రమే. నిజంగా ఒక మనిషి జ్ఞాపకశక్తి పెరగడానికి యింత చిన్న ట్రైనింగ్ సరిపోతే ఈ పాటికి ప్రపంచంలో ఎంతోమంది మేధావులు తయారై వుండేవారు.

మూడు వందల రూపాయలిచ్చి ఓ హిప్నాటిస్టు దగ్గర జ్ఞపకశక్తిని 'కొనుక్కోవడానికి' ముందు మీరు ఆ హిప్నాటిస్టు దగ్గర వున్న పేషెంట్లని ఇంటర్వ్యూ చెయ్యండి. మీలాగే జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చనే భ్రమతో వచ్చిన స్టూడెంట్స్‌లో ఎంతమంది ఈ విధంగా 'రిలాక్స్' అయి తమ జ్ఞాపకశక్తిని పెంచుకొని, డాక్టర్లు ఇంజనీర్లు అయ్యారో, స్టాటిస్టిస్ యిమ్మని

ఆ హిప్నాటిస్టుని అడగండి. మీలాంటి తలనొప్పి వ్యవహారాన్ని వీలయినంత తొందరగా వదిలించుకోవడానికి ఆ హిప్నటిస్టు ప్రయత్నిస్తాడు.

హిప్నాటిజంవల్ల ఎంగ్జయిటీ న్యూరోసిస్ తగ్గొచ్చు. జ్ఞాపకశక్తి పెరిగిన సూచన్లు లేవు. హిప్నటిస్టుల కొడుకులు, కూతుర్లు, స్టేటు రాంకులు వచ్చిన దాఖలాలు లేవు.

ఒక మనిషి మానసిక బలహీనతల మీద ఆడుకోవడం తెలివైనవాడి పని అన్న విషయాన్ని గుర్తించండి. అలాగే మీ పిల్లలకి తలనొప్పి వచ్చినా, కడుపునొప్పి వచ్చినా హిప్నటిస్టుల దగ్గరికి తీసుకువెళ్లడం మానేయండి.

ఇలాంటి హిప్నటిస్టుల కన్నా, మీరు వీలయినంతవరకూ మానసిక శాస్త్రవేత్తల దగ్గరికి మీ పిల్లలని అప్పుడప్పుడూ తీసుకెళుతూ వుండడం చాలా మంచిది. ఒక సైకియాట్రిస్టు దగ్గర మీరూ మీ పిల్లలు సరదాగా, అదేదో రోగం నయం చేసే పద్ధతిలో కాకుండా కూర్చొని కొంతసేపు కబుర్లు చెప్పుకుంటూ వుంటే మీ పిల్లవాడి సైకాలజీ బలహీనతలు, మానసిక స్థితి గురించి ఆ సైకియాట్రిస్టు మీకు విశదీకరించి చెప్తాడు.

పదిహేనేళ్ళ వయస్సులో కనీసం ఒక్కసారైనా మీరు ఆ విధంగా సైకియాట్రిస్టుని కలుసుకోవడం ఎప్పుడూ మంచిది. కేవలం పిచ్చివాళ్ళు మాత్రమే సైకియాట్రిస్టుల దగ్గరకి వెళతారనుకోవడం తప్పు.

పిల్లలకు కొన్ని వింత అలవాట్లుంటాయి. అవి అపాయకరమైమవి కాని పక్షంలో వాటిని కొనసాగించడంలో ఏ ప్రమాదమూ లేదు. ఉదాహరణకి, ఓ పిల్లవాడికి టేప్‌రికార్డర్ వింటూ పుస్తకం చదవడం అలవాటైతే, అతడి చదువు ఏ విధంగానూ ఆ టేప్‌రికార్డర్ వల్ల భంగం కలగడం లేదన్న విషయం రుజువైతే అతన్ని ఆ అలవాటునే కొనసాగించనివ్వండి.

ఏదో ఆలోచిస్తూ పుస్తకం చదివేకన్నా, ఓ వేపు టేప్‌రికార్డర్‌లో నుంచి మంద్రమైన మ్యూజిక్ వస్తుండగా, అతడు పాఠం చదవడంలో బాగా లీనమైతే అందులో నష్టం ఏముంది?

అదే విధంగా టైంటేబుల్ ప్రకారం రోజూ ఠంచన్‌గా ఏడయ్యేసరికి పుస్తకాలు ముందేసుకుని కూర్చోవాలి అన్న రూల్ మీ పిల్లవాడికి ఇష్టం లేకపోతే, అందులో తప్పేం లేదు. ఒకటి రెండ్రోజులు అతను ఏమీ చదవకుండా రిలాక్స్ అవదల్చుకుంటే తప్పకుండా అవనివ్వండి.

అలా అని ఎప్పుడేనా రిలాక్సేషన్లోనే అతడు ఆనందం ఆరంభిస్తే మాత్రం, తప్పనిరిగా మీరా వ్యవహారంలో జోక్యం చేసుకోండి.